క్లుప్తంగా...

అభివృద్ధిలో రాజకీయం తగదు

శంషాబాద్: శ్మశానవాటిక అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న రాజకీయాలు అసహ్యంగా ఉన్నాయని బీజేవైఎం మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌యాదవ్, ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విమర్శించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలు చందాలతో సౌకర్యాలు కల్పించుకుంటున్న సమయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు. పదమూడో వార్డులో అభివృద్ధిని పక్కనపెట్టి రాజకీయాలు చేస్తున్న వ్యక్తులు బీజేపీని అందులోకి లాగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

'పేదలను పట్టించుకోని ప్రభుత్వం'


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: బీఆర్ఎస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ భూమి కనిపిస్తే పాపంలా మారిందని, పేదలకు ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్రూమ్‌లను పట్టించుకోకుండా అమ్మడం, తమ పార్టీ వారికే కేటాయించుకోవటం చేస్తుందని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోకాపేట సర్వే నెంబర్ 239, 240లలో గత ప్రభుత్వం ఖానాపూర్, కోకాపేట గ్రామస్తులకు 60 గజాల ఇళ్ల పట్టాలకు ఇచ్చిన స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీకి కేటాయించుకోవటం తగదన్నారు. గండిపేట మండలంలో వేలాది మంది డబుల్ బెడ్రూంలకు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు వాటి గురించి పట్టించుకోలేదన్నారు.

పనుల పరిశీలన



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శనివారం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

కొండాపూర్ రోడ్డు విస్తరణలో తీవ్ర జాప్యం

● ఫ్లైఓవర్ నిర్మాణం కోసం తప్పని రోడ్డు మూసివేత ● మండుటెండలో వాహనదారుల అవస్థలు ● పోలీసులకు తప్పని తిప్పలు ● ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో జీహెచ్ఎంసీ విఫలం

గచ్చిబౌలి: ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడం అవసరమైనప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా కొండాపూర్ రోడ్డును మూసివేయడం, ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపందాల్చడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల పాటు మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు ప్రకటించడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. గచ్చిబౌలి జంక్షన్ నుంచి మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు 215 అడుగుల మేర మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. రోడ్డు వెంట ఉన్న నిర్మాణాల యజమానులు ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తీసుకొచ్చి రోడ్డు విస్తరణను ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వస్తున్నారు. ఫలితంగా గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్‌కు వెళ్లే రోడ్డు ఒక్కో వైపు కేవలం రెండు లైన్లు మాత్రమే ఉంది. విస్తరణ చేపడితే ఇప్పుడున్న రోడ్డు రెండింతలు అయ్యే అవకాశం ఉంది. కాని రోడ్డు విస్తరణ చేపట్టకుండా ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొండాపూర్ వైపు సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కోసం రోడ్డును మూసి వేయడం విమర్శలకు తావిస్తోంది. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడంతో వాహనాల రాకపోకలకు వీలు లేకుండా ఉంది.


మెహిదీపట్నం వైపు వెళ్లకుండా బయోడైవర్సిటీ జంక్షన్ రోడ్డు మూసివేత


బయోడైవర్సిటీ నుంచి మాదాపూర్ వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

ఈ రోడ్లలో వెళ్లాలంటే నరకమే..

◆ లింగంపల్లి నుంచి డీఎల్ఎఫ్ మీదుగా కొండాపూర్ వైపు, మియాపూర్, కొండాపూర్‌నుంచి వాహనాలు మైండ్‌స్పేస్ జంక్షన్‌కు వెళ్లాలంటే ట్రాఫిక్‌లో గంటల కొద్ది గడపాల్సి వస్తుందని వాహనదారులు గగ్గోలుపెడుతున్నారు. అంతే కాకుండా మెహిదీపట్నం నుంచి వాహనాలు సైబర్‌టవర్ వైపు, సైబర్ టవర్ నుంచి గచ్చిబౌలి వైపు వాహనదారులు ట్రాఫిక్‌లో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మాదాపూర్, కొండాపూర్, శిల్ప లేఅవుట్, బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్, గచ్చిబౌలి వైపు నుంచి వచ్చే వాహనాలతో మైండ్ స్పేస్ జంక్షన్‌లో ట్రాఫిక్ ఆగిపోతోంది.

విస్తరణ మరిచారు..

◆ గచ్చిబౌలి జంక్షన్ నుంచి అంజయ్యనగర్ వరకు 215 అడుగుల రోడ్డు విస్తరణలో రోడ్డుకు రెండు వైపులా 48 నిర్మాణాలతో పాటు కొన్ని ఖాళీ స్థలాలు ఉన్నట్లు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం గుర్తించింది. ఇప్పటికే 30కి పైగా నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. 27 మంది టీడీఆర్ తీసుకునేందుకు అంగీకరించారు.

◆ మిగిలిన నిర్మాణాలను, ఖాళీ స్థలాలను ల్యాండ్ అక్విజేషన్‌లో చేర్చి నోటీసులు ఇవ్వనున్నారు. జీహెచ్ఎంసీ ఆయా విభాగాల అధికారుల సమన్వయం లోపంతో రోడ్డు విస్తరణ ఇప్పటికీ కొలిక్కి రాలేదని చెప్పాలి. ఇప్పటికే నిర్మాణాలకు మార్కింగ్ చేసి, టీడీఆర్ చెల్లించి రోడ్డు విస్తరణ చేపడితే రోడ్డు మూసి వేయాల్సిన అవసరం ఉండేది కాదు. డైవర్షన్‌లతోను పని లేకుండా ఉండేది. ప్రధాన రహదారుల విస్తరణలో నిర్మాణాలు కోల్పోయే వారికి 400 శాతం టీడీఆర్ ఇచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం జీఓ జారీ చేసిన విషయం తెలిసిందే. ఖాజాగూడ జంక్షన్ నుంచి నానక్‌రాంగూడ రోటరీ వరకు ఇదే తరహాలో టీడీఆర్ చెల్లించి మోడల్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని తెలిసీ రోడ్డు విస్తరణ చేపట్టకపోవడం జీహెచ్ఎంసీకే చెల్లింది. ట్రాఫిక్ సమస్య కూడా జీహెచ్ఎంసీ నిర్వాహకమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్లపైనే విధులు..

◆ గంటలో వందలాది వాహనాలు తిరిగే కొండాపూర్ రోడ్డు మూసివేతతో గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, మైండ్‌స్పేస్, సైబర్‌టవర్ జంక్షన్‌లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సోమవారం నుంచి ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లపైనే విధులు నిర్వహిస్తున్నారు.

◆ ఒక్క మైండ్ స్పేస్ జంక్షన్‌లోనే ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ, ఏసీపీ, లాండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ, ఏసీపీ, సీఐలు ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తున్నారు. ప్రధాన జంక్షన్‌లలో ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.

◆ ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాల్చడంతో సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర రంగంలోకి దిగి పలు సూచనలు చేశారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టారు.

డైవర్షన్లతో ఉపశమనం..

◆ సోమ, మంగళవారం నెలకొన్న ట్రాఫిక్ రద్దీతో పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టారు.

◆ గచ్చిబౌలి వైపు నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే వాహనాలు బయోడైవర్సిటీ ఫస్ట్ లెవల్ ఫ్లై ఓవర్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. కింది నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లకుండా జంక్షన్‌ను మూసి వేశారు. గచ్చిబౌలి ఫ్లైఓవర్ కింద యూటర్న్, మైండ్ స్పేస్ ఫ్లైఓవర్ కింద టీహబ్‌కు వెళ్లే రైట్‌టర్న్, మైహోం భూజ జంక్షన్లను మూసివేశారు.

◆ ఐకియా రోడ్డులో యూటర్న్, ఇనార్బిట్ మాల్‌కు వెళ్లే రోడ్డులో ఫ్లై ఓవర్‌కింద మరో యూటర్న్‌ను తెరిచారు. శిల్ప లేఅవుట్‌లో మూసివేసిన సిగ్నల్‌లో అన్ని వైపులా వాహనాల రాకపోకలకు అనుమతించారు.

◆ కొండాపూర్‌నుంచి గచ్చిబౌలి వైపు వాహనాలు నేరుగా రాకుండా క్యూమార్ట్ వద్దరోడ్డును మూసివేశారు. సైన్‌బోర్డులు, యూటర్న్‌ల మూసివేత, కొత్తగా యూటర్న్‌లతో కొద్దిగా ట్రాఫిక్‌కు ఉపశమనం కలిగిందనే చెప్పాలి. వర్షం వస్తే గ్రిడ్ లాక్ అయ్యే అవకాశం ఉంది.

◆ ఇప్పటికే కొండాపూర్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. త్వరితగతిన పిల్లర్ల నిర్మాణం చేపట్టి ఒక వైపు వాహనాలను అనుమతించినా కొంత వరకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.


కొండాపూర్ రోడ్డులో ఫ్లైఓవర్ పిల్లర్ల నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాలు

రైల్వే గేటును తెరిపించాలి


పిల్లోనిగూడ రైల్వే గేటు వద్ద బైఠాయించిన బీజేపీ నాయకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడ–పాల్మాకుల మధ్యలో ఉన్న రైల్వే గేటును వెంటనే తెరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నాలుగు నెలలు కావస్తున్నా ఈ రైల్వే గేటును తెరవకపోవడంతో చుట్టూ పక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బీజేపీ నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్ ఆధ్వర్యంలో నాయకులు, గ్రామస్తులు రైల్వే గేటు వద్ద బైఠాయించారు. రైల్వే అధికారులకు ఫోన్‌లో మాట్లాడిన ప్రేమ్‌రాజ్ ఇక్కడి ప్రజల సమస్యలను వివరించారు. గేటు విషయంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీతో మొర పెట్టుకున్నా చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే గేటు తెరిచేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, లక్ష్మయ్య, చంద్రయ్య, పెంటయ్య, కె.శ్రీఖర్‌గౌడ్, యాదగిరి, మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

జీవో 111 ఎత్తివేతతో అభివృద్ధికి బాటలు


మాట్లాడతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

శంషాబాద్: దశాబ్దాలుగా అభివృద్ధికి నిరోధకంగా మారిన జీవో 111 పూర్తి స్థాయిలో ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో శంషాబాద్ అభివృద్ధికి బాటలు పడనున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పొరెపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాచమల్ల సురేష్ అభిప్రాయపడ్డారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీవో 111 కారణంగా నిర్మాణ అనుమతులు సైతం లేకపోవడంతో స్థానిక సంస్థలు కూడా నిర్వీర్యంగా మారాయన్నారు. అనుమతుల మంజూరుతో మున్సిపాలిటీ, పంచాయతీలకు నిధులు సమకూరడంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు సముచితంగా ఆలోచించి మద్దతు పలకాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశంలో కొండ సుదర్శన్‌గౌడ్, పెంటయ్య, కొండ పరమేష్‌గౌడ్, ఆర్. అశోక్, రాజు, నరేష్,నాగరాజు, చంటి పాల్గొన్నారు.

నార్సింగిలో పాత వస్తువుల సేకరణ


నార్సింగిలో త్రిబుల్ ఆర్ కేంద్రాలను ప్రారంభించిన చైర్ పర్సన్

మణికొండ: ఇళ్లలో ఉన్న పాత దుస్తులు, పుస్తకాలు, వస్తువులు, చెప్పులు తదితర వాటిని తమ మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ డి. రేఖయాదగిరి అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలోని అన్ని వార్డులలో వాటి కలెక్షన్ కేంద్రాలైన 'మై లైఫ్– మై స్వచ్ఛ్‌శేఖర్' రథాలను వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ ఎ.సత్యబాబు, కౌన్సిలర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లలో వృథాగా ఉండే వస్తువులతో కాలుష్యం పెరుగుతుందని, మరొకరికి ఇస్తే వినియోగించుకుంటారన్నారు. శనివారం నుంచి జూన్ 5వ తేదీ వరకు వాటిని ప్రతి ఇంటి నుంచి సేకరించి ఆ తరువాత నార్సింగిలో శాశ్వతంగా కొనసాగుతున్న వాల్‌ఆఫ్ కైండ్‌నెస్ కేంద్రంలో ఉంచటం, అనాథాశ్రమాలకు అందజేయటం, పేదలకు అందజేయటం చేస్తామన్నారు. మొదటి రోజు 40 కేజీల దుస్తులు, 20 కేజీల పుస్తకాలు, రెండు కిలోల చెప్పులు, 4 కిలోల పాత వస్తువులను సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.అరుణజ్యోతి, పత్తి ప్రవీణ్‌కుమార్, ఉషారాణి, శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



శంషాబాద్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ కింద అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాటు ఆహారం లేకపోవడమే కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై గులాబీ రంగు చొక్కా, నీలిరంగు జీన్స్ ప్యాంటు ఉన్నాయని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కిరోసిన్ పోసుకుని మహిళ ఆత్మహత్య

మణికొండ: భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదనే మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లోని గుడిసెలలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...హైదర్‌షాకోట్‌లో నివసిస్తున్న పి.పెంటమ్మ తన కూతురు రేణుక(31)ను నాలుగేళ్ల క్రితం నర్సింహకు ఇచ్చి వివాహం చేసింది. అప్పటి నుంచి వారు బతుకుదెరువు కోసం ముంబయి వెళ్లారు. వారం రోజుల క్రితం హైదర్‌షాకోట్‌కు వచ్చిన వారు నర్సింహ ఒక్కడే ముంబయికి వెళ్లటంతో రేణుకా మనస్తాపం చెందింది. శుక్రవారం రాత్రి అందరూ నిద్రించిన తర్వాత గుడిసెలకు దూరంగా వెళ్లి కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని అక్కడిక్కడే మృతి చెందింది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


డీడీకాలనీలో శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బండ్లగూడ: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు 19 నుంచి 27 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 22వ డివిజన్ డీడీకాలనీలో శనివారం పర్యటించి పారిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు, నాలాలు శుభ్రం చేయించి, పబ్లిక్ టాయిలెట్లకు మరమ్మతు పనులు చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి డీఆర్‌సీ సెంటర్లకు ఇవ్వాలన్నారు. కార్పొరేషన్‌లోని డివిజన్‌లు పరిశుభ్రంగా ఉండాలని, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, కాలనీ వాసులు సుదర్శన్, మల్లారెడ్డి, గోవర్ధన్, గోపాల్ పాల్గొన్నారు.

వీఆర్ఏల హర్షం

మణికొండ: వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తామని క్యాబినెట్ సమావేశం తీర్మాణం చేయటంతో గ్రామ రెవెన్యూ సహాయకులు హర్షం ప్రకటించారు. శనివారం గండిపేట మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు జి.కుమార్, ఉపాధ్యక్షురాలు రాజశ్రీ, ప్రధాన కార్యదర్శి జి.దేవేందర్, కోశాధికారి కృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి. వెంకటేశ్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ కేంద్రంలోని 7వ వార్డులో నిర్మాణంలో ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను కౌన్సిలర్ జి. అరుణజ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకపోతే కాంట్రాక్టర్‌లపై చర్యలు తప్పవన్నారు. అధికారులు పనులను నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.

ఘన స్వాగతం



డి.రాజా, సీతారాం ఏచూరిలకు స్వాగతం పలుకుతున్న నాయకులు

శంషాబాద్: సీపీఐ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శులు డి. రాజా, సీతారాం ఏచూరిలకు శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన వారికి సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు నర్సింహ, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి నరసింహారావు, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్ స్వాగతం పలికారు.

బైక్ దొంగల అరెస్ట్.. 9 బైక్‌ల స్వాధీనం

గచ్చిబౌలి: దుకాణాల ముందు పార్కు చేసిన బైక్‌లను తస్కరించే ముగ్గురు దొంగలు కటకటాలపాలయ్యారు. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ రవీందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాంకు చెందిన జయంత్‌దువ్వార(27), దీప్‌జ్యోతి రాజ్‌కోవా(25), రాజ్‌కిషోర్ మిల్లి(30) ముగ్గురు సెక్యూరిటీ గార్డులు. కాగా ఈ ముగ్గురు కొంతకాలంగా దుకాణాల ముందు పార్కు చేసిన బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. వీరు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు బైక్‌లు, రాయదుర్గం పీఎస్ పరిధిలో రెండు, మాదాపూర్ పీఎస్ పరిధిలో రెండు, జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో ఒక బైక్ చోరీ చేశారు. వీరి వద్ద నుంచి తొమ్మిది బైక్‌లను శనివారం గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం


నియామక పత్రాలు అందిస్తున్న జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

మణికొండ: కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా క్యాతం అశోక్‌యాదవ్‌ను రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నార్సింగిలోని పార్టీ కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఏ–బ్లాక్ అధ్యక్షుడు నవీన్‌ల ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యక్షుడిగా కట్ట అశోక్, ఎండీ అఫ్జల్ షరీఫ్, మారెప్ప, ప్రధాన కార్యదర్శిగా కిషన్, కార్యదర్శిగా మైలారం ప్రదీప్, కోశాధికారిగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా దశరథ్‌యాదవ్, యాదగిరి, కౌన్సిలర్లు విజయ్‌బాబు, అమరేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. పార్టీకి నార్సింగి కంచుకోటగా ఉందని, రాబోయే రోజుల్లో మరింత పటిష్టంగా తయారు చేసేందుకు నూతన కమిటీ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు సాయినాథ్ పాల్గొన్నారు.